ఆందోళనలో మామిడి రైతులు

- మండలంలో 4,668 ఎకరాల్లో సాగు
- సాధారణంగా 30వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం
- ఈసారి 10వేల టన్నులు సైతం దాటని వైనం



తెగుళ్లతో నేలరాలుతున్న కాయలు



వీపనగండ్ల శివారులో కాయలు కాయని మామిడి తోట

వీపనగండ్ల: రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన మామిడి రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగిలింది. జిల్లాలోనే వీపనగండ్ల మండలం మామిడి సాగులో ప్రథమ స్థానంలో ఉన్నా అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. మామిడి తోటల్లో పూత దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు సరైన పద్ధతులు పాటించకపోవడంతో పూర్తిగా దిగుబడి తగ్గిపోయింది. పంటలను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని మామిడి తోటల రైతులు, కౌలుదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పూత సమయంలో తెగుళ్లు

మండల వ్యాప్తంగా 4,668 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేశారు. దాదాపు 30 టన్నుల పంట దిగుబడి రావాల్సి ఉండగా.. పూత సమయంలో తెగుళ్లు సోకడంతో ఈసారి సుమారు 10 వేల టన్నుల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు, కౌలుదారులు ఆదుకునే ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. బొల్లారంలో 193 మంది రైతులు 435 ఎకరాల్లో, కొర్లకుంటలో 97 మంది 191 ఎకరాలు, వల్లభాపురంలో 40 మంది 66 ఎకరాలు, గోపల్‌దిన్నెలో 156 మంది 384 ఎకరాలు, కల్వరాలలో 130 మంది 345 ఎకరాలు, గోవర్ధనగిరిలో 377 మంది 867 ఎకరాలు, పుల్గర్‌చర్లలో 89 మంది 196 ఎకరాలు, సంగినేనిపల్లిలో 165 మంది 361 ఎకరాలు, సంపత్‌రావుపల్లి 56 మంది 175 ఎకరాలు, తూంకుంటలో 162 మంది 441 ఎకరాలు, వీపనగండ్లలో 513 మంది రైతులు 1207 ఎకరాల్లో మామిడి సాగు చేశారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావంతో..

రెండేళ్లుగా మామిడి పంట దిగుబడి తగ్గిపోగా.. ఈ ఏడాది కూడా తెగుళ్లు వెంటాడడంతో మామిడి రైతు కుదేలవుతున్నాడు. నల్ల తామర పురుగు, తేనెమంచు తదితర తెగుళ్ల వల్ల 90 శాతం పంట దిగుబడి తగ్గిపోయింది. చీడపీడల నివారణ కోసం ఉద్యానశాఖ అధికారులు తూతూ మంత్రంగా అవగాహన కల్పించి చేతులు దులుపుకోవడంతో మామిడి రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నష్టపోయిన రైతులను, కౌలుదారులను గుర్తించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గతంలో ఇలాంటి స్థితి చూడలేదు



ఎన్నో ఏళ్లుగా మామిడి తోటలను సాగు చేస్తున్నా. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెడితే కనీస డబ్బులు కూడా రావడం లేదు. ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలి.

– ధర్మారెడ్డి, మామిడి రైతు, వీపనగండ్ల

మూడేళ్లూ నష్టాల్లోనే..



మూడేళ్లుగా మామిడి తోటల్లో నష్టాలు వస్తున్నాయి. రూ.5 లక్షలు వెచ్చించి రెండు చోట్ల తోటలను లీజుకు తీసుకున్నా. ఏ తోటలో కూడా పంట దిగుబడి రాలేదు. క్రిమి సంహారక మందులకు కూడా రూ.వేలు ఖర్చు చేశాం. పూర్తిగా పంట దిగుబడులు తగ్గిపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వమే తమకు చేయూతనిచ్చి ఆదుకోవాలి.

– తెలుగు రాజు, కౌలు రైతు, సంగినేనిపల్లి

సామూహిక చర్యలతోనే ప్రయోజనం



మామిడి తోటలను సాగు చేసిన రైతులు తెగుళ్ల నివారణకు సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి. ఒక తోటలో క్రిమిసంహారక మందులు వాడితే మరో తోటలో తెగుళ్లు, చీడపీడలు చొరబడుతున్నాయి. పంటల దిగుబడి కోసం రైతులకు పలుమార్లు అవగాహన సదస్సులు నిర్వహించాం. పరిహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– కృష్ణ, మండల ఉద్యాన శాఖ అధికారి, వీపనగండ్ల

మెడికో విద్యార్థికి అభినందన



యశ్వంత్‌రెడ్డి

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందదిన అగ్గన్నగారి రవీందర్‌రెడ్డి, సుజాత దంపతుల కుమారుడు యశ్వంత్‌రెడ్డి మెడికల్ పీజీలో ఆల్ ఇండియా 1,071 ర్యాంకు సాధించాడు. యశ్వంత్‌రెడ్డి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని రిమ్స్ కాలేజీలో మెడిసిన్ పూర్తి చేసిన ఆయన పీజీ ప్రవేశ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే తన లక్ష్యం అని చెప్పారు. తాను నిరుపేద కుటుంబంలో పుట్టినందుకు ఆ కష్టాలు తనకు తెలుసని, గ్రామస్థాయిలో ఇప్పటికీ సరైన వైద్యం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. పేదలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా వారికి సేవ చేయడాన్ని బాధ్యతగా స్వీకరిస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు యశ్వంత్‌రెడ్డిని అభినందించారు.

సాగునీరు ఇవ్వాలి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడుమ కాల్వ ఆయకట్టు పంటలు చేతికి వచ్చే వరకు సాగు నీరు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రాబర్ట్ కోరారు. జూరాల కాల్వ ద్వారా జిల్లాలో 8,500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారని, అర్ధాంతరంగా సాగునీటి విడుదలను ఆపేస్తే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించి రైతులు నష్టపోకుండా పంటలకు ఏప్రిల్ వరకు సాగు నీరు అందించాలని కోరారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో ఉపాధి కూలీలకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఏఎన్ఎం సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కూలీలు తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు అవగాహన కల్పించారు. నీరు ఎక్కువగా తాగాలని సూచించారు.

ఆది బసవన్న ఆలయంలో ప్రత్యేక పూజలు




పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఆది బసవన్న ఆలయంలో గణపతి, కుమారస్వామి, నంది విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ వారు ఆలయాన్ని శుద్ధి చేయించి, ఆలయ అర్చకులతో మహాయాగం, బసవేశ్వరుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు.

ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీకేజీ



వీపనగండ్ల: విద్యా విధానంపై ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ నిర్ణయాల వల్లే పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పేపర్ లీకేజీల విషయాన్ని నిరసిస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీస్‌ను ముట్టడించేందుకు వెళ్లిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీల వ్యవహారంలో పెద్ద వ్యక్తుల ప్రమేయం ఉందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శివాజీ, వెంకటయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేశ్, నాయకులు నరేశ్, కేశవ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



ఖిల్లాఘనపురం: రక్తదానం చేయడం వలన మరో వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని తహసీల్దార్ భానుప్రకాష్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వనపర్తి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన దాతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు. ఒక్కో సమయంలో సరైన గ్రూపు రక్తం లభించక ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయడం వలన రెడ్‌క్రాస్ వారు రక్త నిధులను సమకూర్చి అత్యవసర సమయాల్లో అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్: శాగాపూర్‌కు చెందిన నాగమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.28వేల చెక్కును బుధవారం ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ పంపిణీ చేశారు. సీఎం సహాయనిధితో పేద వర్గాలు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారన్నారు. చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, చెక్కు మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, రవికుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. హలీంపాష, రాములు, కొండయ్య, కృష్ణయ్య, యోగయ్య, బాలస్వామి, రమేష్ ఉన్నారు.



కొనసాగుతున్న ‘కంటివెలుగు’

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి, తెల్లరాళ్లపల్లి తండా, రేమద్దుల గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం ఆయా కేంద్రాలను సందర్శించి పరీక్షలపై ఆరా తీశారు. గ్రామాల్లో కంటి పరీక్షలపై అవగాహన కల్పించి ఎక్కువ మంది పరీక్షలు చేయించుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

వీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు శ్వేత అన్నారు. వారం రోజులుగా గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈ క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. బుధవారం శిబిరంలో 222 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేసినట్లు ఆమె తెలిపారు.



తూంకుంటలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జాన్ కృపాకర్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, 15వ తేదీ నుంచి పురపాలక పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధించడంతో పాటు, ప్లాస్టిక్ వాడితే వచ్చే నష్టాలపై ప్రజలకు గతంలోనే అవగాహన కల్పించిందన్నారు. వ్యాపార సంస్థల వారు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

అమరచింత: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. సిట్ రాష్ట్ర ప్రభుత్వ పంజరంలో చిలక అని, వాస్తవాలు బయటికి రావని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి ఉద్యోగ భర్తీలు చేయకుండా ఎన్నికల సమయంలో నోటిఫికేషన్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీ చేతకాదని, ప్రశ్నాపత్రాల లీకేజీలు అంటూ కాలయాపన చేయడానికే కుట్రలు పన్నిందన్నారు. ఇప్పటికైనా నిందితులను అరెస్టు చేసి నిరుద్యోగ యువకులకు న్యాయం చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో వారం రోజుల క్రితం వడ్డెసంపంగి రంగయ్య అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగ ఆదుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉడుత కుర్మయ్య, గోవుల నాగరాజు, వడ్డె కృష్ణయ్య, ఈదరాజు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతం



పాన్‌గల్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

ఆత్మకూర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 93 మందికి గాను 89 మంది, జనరల్ విభాగంలో 325 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 298 మంది పరీక్ష రాశారు. వికాస్ కళాశాల సెంటర్‌లో జనరల్ విభాగంలో 178 మంది విద్యార్థులకు గాను 168 మంది హాజరయ్యారని అధికారులు రాజేశ్వర్ రావు, సునీల్‌కుమార్ తెలిపారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, వాసవి జూనియర్ కళాశాల కేంద్రాల్లో 369 మంది విద్యార్థులకు గాను 348 మంది పరీక్షలకు హాజరు కాగా 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

గోపాల్‌పేట: స్థానిక జూనియర్ కాలేజీలో మొత్తం 216 మంది విద్యార్థులకు గాను 211 మంది హాజరయ్యారు. ఒకేషనల్ సబ్జెక్టులో 34 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. చీఫ్ సూపరింటెండెంట్ బాలప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాంరెడ్డి, సిట్టింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారు. తహసీల్దార్ సునీత పరీక్ష కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 102 మంది విద్యార్థులకు గాను 99 హాజరు కాగా.. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎవరు గుమికూడకుండా స్థానిక ఎస్ఐ నాగన్న పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం 75 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 70 మంది హాజరయ్యారని అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కొత్తకోట: మండలంలోని అమడబాకుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కలెక్టర్‌గా వైశాలి, ఎంఈఓగా విద్యశ్రీ, హెచ్‌ఎంగా వర్షిణి, పీఈటీగా కిరణ్మయి, అటెండర్‌గా కృష్ణ చరణ్‌లతో పాటు మరో 18 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థులకు మంచిగా పాఠాలు బోధించిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర చంద్రశేఖర్ బహుమతులను ప్రదానం చేశాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్‌గౌడ్, శ్రీలత, సీఆర్పీ దస్తగిరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో..

కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో.. విద్యార్థులు ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు విద్యాశాఖలో పనిచేసే వివిధ ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తించారు. కార్తీక్ ప్రధానోపాధ్యాయుడిగా మరో 25 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, ఉపాధ్యాయులు బేతనగౌడ్, వరలక్ష్మి, కవిత, రవికుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రం ఇవ్వొద్దు



ఆత్మకూర్: మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదాసి కుర్వ తెగకు సంబంధించిన 520 కుటుంబాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న గొల్ల, కురుమలు కూడా తాము మాదాసి కుర్వలమని చెప్పుకుంటూ రాజకీయం చేస్తున్నారని, తప్పుడు మార్గాలను ఎంచుకుని నిజమైన దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మాదాసి కుర్వలు లేరని ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదని తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, బాలమణ్యం, లింగన్న, జానకీరాములు, సోంబాబు, అనిల్, దావీదు, అశోక్, నవీన్, దేవ, శివ, రవిప్రకాష్, మహేష్, రాము, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రాజ్‌భవన్ ముట్టడికి తరలిన నాయకులు

వనపర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్‌భవన్ ముట్టడికి వనపర్తి జిల్లా కేంద్రం నుంచి బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమం మాజీ మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకొని పని చేస్తుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న నాయకులు దేశాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి.. ప్రజల్లో మతకలహాలు రేపుతూ చిచ్చులు పెడుతున్నారని దుయ్యబట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం తరపున ఉమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డ్స్ 2023 కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బీఎస్‌కే రమేష్ తెలిపారు. మహిళలు పారిశుద్ధ్యం, వ్యర్థ పదార్థాల స్ఫూర్తిదాయక నిర్వహణ, ఆదర్శప్రదమైన కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు చేపట్టే వారు మార్చి 8వ తేదీ నుంచి ఏప్రిల్ 5వరకు దరకాస్తులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్‌ట్యాంకు శుభ్రత సేవలు, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, చెత్త రవాణా, ఎంఆర్‌ఎఫ్ ఆపరేషన్, చెత్త నుంచి వాణిజ్య పరికరాలు, చికిత్స సౌకర్యాలు ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ తదితర అంశాలపై దరకాస్తులు చేసుకోవాలని సూచించారు.

కాన్షీరాం సేవలు మరువలేనివి



శ్రీరంగాపురంలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెబ్బేరులో..

వనపర్తి టౌన్: బహుజన రాజ్యాధికార సిద్ధాంతకర్త, అంబేడ్కర్ ఇజంతో సమాజాన్ని తట్టిలేపిన మానవతా మూర్తి కాన్షీరాం అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర ద్వారా ప్రజలను చైతన్యపరిచేందుకు అహర్నిశలు శ్రమించిన కాన్షీరామ్ చరిత్ర సృష్టించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, కవి ఈశ్వర్, డప్పు నాగరాజు, వెంకటేష్, వెంకటయ్య, శ్రీనివాసులు, విష్ణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం బాలస్వామి, ఘనపురం కృష్ణ, రాంబాబు, సుజాత, అశోక్, మనోహర్, అరుణ్‌కుమార్, సుబ్రమణ్యం, సహదేవ్, ఈశ్వర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బహుజన సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షుడు మల్లేష్, శాంతయ్య, సత్యయ్య, శ్రీను, స్వామి, రాఘవేందర్, జగన్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుడిసె ధర్మ, ఎంపీటీసీ ఎల్లస్వామి, నాయకులు భీసన్న, మధు, విష్ణు, నాగేష్ , లక్ష్మణ్, శివ, శ్యామల, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు వేగంగా పరిష్కరించాలి



పెద్దకొత్తపల్లి: విద్యుత్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏడీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 3వ తేదీ నుంచి 12వ తేదీలోగా విద్యుత్ రీడింగ్‌లను చూసి నెల చివరి వరకు పూర్తి స్థాయిలో బిల్లులను వసూలు చేయాలని అన్నారు. విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందిన రైతుల వివరాలు సేకరించాలని ఆయన సూచించారు. గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సంబంధిత లైన్‌మెన్లు ఏఈకి సమాచారం అందించాలన్నారు. వ్యవసాయనికి రైతులు డీడీలు కట్టి సామగ్రి కోసం ఎదురు చూస్తున్నారని, క్రమ పద్ధతిలో వారికి సామగ్రిని అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రదీప్‌గౌడ్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.